క్రీడలతో మానసికోల్లాసం



నవతెలంగాణ-తొగుట

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరకు శ్రీనివాస్‌రెడ్డి, తొగుట సీఐ కమలాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని కాన్గల్ గ్రామానికి, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు ముడికే స్వామి యాదవ్ తన తండ్రి క్రీ,శే,ముడికె రాజయ్య జ్ఞాప కార్థం వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. మండల స్థాయి నుండి 12 జట్లులు పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమల కొమురయ్య,పిఏసీఎస్ డెరెక్టర్ మహిపాల్ రెడ్డి, బీజేపీ జిల్లా పధాన కార్యదర్శి విభిషన్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ పిట్ల సత్తయ్య,కాంగ్రెస్ మండల అధ్య క్షుడు అక్కం స్వామి,జిల్లా కాంగ్రెస్ నాయకులు నరెందర్ రెడ్డి,సర్పంచ్ ప్రేమల చంద్రారెడ్డి,నాయ కులు గొడుగు దామోదర్, సయ్యద్ అన్సర్,కనక య్య, బసిరుద్దీన్, స్వామియాదవ్,డిలర్ వెంకట రెడ్డి,బాల్ రాజ్, కొండల్ రెడ్డి,గ్రామ యువకులు వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారు లు,ప్రజా ప్రతినిధులుపాల్గొన్నారు.క్రీడలు విజయ వంతం చేసిన ప్రతి ఒక్కరికీ స్వామి యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

పాత కక్షలతో ఇంటిపై దాడి



నవతెలంగాణ - నార్సింగి

పాత కక్షలతో ఇంటిపై దాడి చేసిన ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని వల్లభాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహియొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం... వల్లభాపూర్ గ్రామానికి చెందిన నూకల మల్లయ్య రాత్రి 10:45 గంటల ప్రాంతంలో తన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకుంటున్నారు. నార్సింగికి చెందిన ముగ్గురు మాడుగుల దాసు, దాయం చందు, పుట్ట నరేష్ ద్విచక్ర వాహనంపై వచ్చి మల్లయ్య ఇంటి తలుపులు తట్టారు. తలుపులు తెరిచిన వెంటనే ముగ్గురు బూతులు తిడుతూ, బెదిరిస్తూ మల్లయ్యను చంపుతామంటూ అతనిపై దాడికి దిగారు. పక్క ఇంట్లో ఉండే బత్తుల మల్లయ్య కుటుంబం గమనించి గొడవ పడుతున్న వీరిని విడిపించారు. దాడి చేసిన వారికి, మల్లయ్య కుటుంబాలకు పాత కక్షలు ఉన్నాయని, గతంలో కూడా నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉందన్నారు. నూకల మల్లయ్య స్టేషన్లో ఫిర్యాదు చేయగా ద్విచక్ర వాహనాన్ని జప్తు చేసుకుని, కేసును నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


పతంగుల పోటీ అభినందనీయం




నవతెలంగాణ - పటాన్ చెరు

సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని ఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్‌ను పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాలి పటాలు ఎగుర వేసి అందరిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎం డి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా మకర సంక్రాంతి పర్వదినం రోజు యువతను ఉత్సాహపరిచే విధంగా పతంగుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పతంగుల పోటీల్లో గెలుపొందిన గోనెమ్మ బస్తీకి చెందిన గురుకు 5 వేల బహుమతిని అందజేశారు.ఈ కార్యక్రమంలో పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్,సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, ఎం డి ఆర్ యువసేన ప్రధాన సలహాదారు పృథ్వీరాజ్, అధ్యక్షుడు మధు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సింగరాల మల్లన్నను జాతర






నవతెలంగాణ-తొగుట

ఘనంగా సింగరాల మల్లన్నను జాతర కొనసాగింది. ఆదివారం మండలంలోని జప్తి లింగారెడ్డి పల్లి గ్రామ సమీపంలో ఉన్న సింగరాల మల్లన్న జాతర లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ సిలివేరి జ్యోతి మల్లారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బక్క కనకయ్య, టీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సిలివేరి రాంరెడ్డి,ఆయా గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజాప్రతినిధులు,వివి ధ పార్టీల నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మల్లన్న ను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సింగరాల మల్లన్నను దర్శించుకున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

జప్తి లింగారెడ్డిపల్లి సింగరాల మల్లన్నను దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షు డు అక్కం స్వామి, జిల్లా నాయకులు భూస నిరం జన్ రెడ్డి,యెన్నం భూపాల్ రెడ్డి, ఫిషర్మెన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి,గ్రామ అధ్యక్షు లు కొండల్ రెడ్డి, సిద్ధారెడ్డి, తిరుమలు, నాగరాజు, మల్లయ్య, చంద్రం, కనకయ్య రమేష్, భిక్షపతి, భాస్కర్ రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలి



నవ తెలంగాణ- గజ్వేల్

లైన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆ సంఘం అధ్యక్షుడు నేతి శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ప్రజలకు మరింత చేరువ కావాలని ఆయన పిలుపునిచ్చారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా కార్యక్రమాలు చేపట్టి లైన్స్ క్లబ్ కు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. అనంతరం కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయం అని లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 6 నెలలలో దాదాపు 1100 లకు పైగా సేవా కార్యక్రమాలకు నిర్వహించడం గొప్ప విషయం అని మరిన్ని సేవా కార్యక్రమాలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. లయన్ పరమేశ్వర చారి, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ, సెక్రటరీ సంజయ్ గుప్తా, లయన్ రామ్ ఫనిధర్ రావు,లయన్ మతీన్, లయన్ నాగేంద్రం, దొంతుల సత్యనారాయణ, అజయ్, కార్తీక్, శ్రీధర్ పాల్గొన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు



నవ తెలంగాణ- రాయపోల్

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తానా ఉమర్ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. గాలిపటాలను ఎగర వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలన్నారు. విలువైన నగలు వస్తువులు డబ్బులు భద్రపరచుకోవాలన్నారు.

గాలిపటం ఎగరేసిన సర్పంచ్



నవతెలంగాణ- చేగుంట

ప్రజల జీవితాల్లో భోగి భాగ్యాలు, సంక్రాంతి కొత్త కాంతి, కనుమ కనువిందుగా ఉండాలని సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజులు పేర్కొన్నారు. చేగుంట మండలం చందాయిపేట గ్రామ ప్రజలకు మకర సంక్రాంతి పర్వదినం భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుటుంబ సభ్యులతో గాలిపటం ఆకాశం లోకి వదిలి ఆనందోత్సవాలతో జరుపుకున్నారు జరుపుకున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ సకల సంపదలతో సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందంగా జరుపుకోవాలని.ఈ సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన కాంతి తీసుకరావాలని ఆకాంక్షించారు. ప్రజలందరు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని,పసిడి పంటలతో విలసిల్లాలని కోరుకుంటున్నామన్నారు.

యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాలకృష్ణ



నవతెలంగాణ-చేర్యాల

యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన తనను నియమించినట్లు మాదాసు బాలకృష్ణ ఆదివారం తెలిపారు. నియామక పత్రాన్ని యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షులు ఆరుట్ల అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రెడ్డి,కోశాధికారి బైకెన్ కృష్ణ చేతుల మీదుగా అందుకున్నట్లు పేర్కొన్నారు. తనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

వైభోవపేతంగా గోధాదేవి కల్యాణం



నవతెలంగాణ-బెజ్జంకి

భోగి పండుగా సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో భోగి పండుగ సందర్భంగా అదివారం గోదాదేవి కళ్యాణం అర్చకులు వైభోవపేతంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ద్యావనపల్లి మంజుల దంపతులు, ఆలయ ధర్మ కర్తల కమిటి చైర్మన్ బండారి రాములు హజరై హజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యులు,గ్రామస్తులు హాజరయ్యారు. దాచారం గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.సర్పంచ్ పెంటమీది శ్రీనివాస్ దంపతులు హజరై ప్రత్యేక పూజలు చేశారు.గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హజరై పూజల్లో పాల్గొన్నారు.

కంకర మిల్లుల్లో కాసుల వర్షం



- ఇష్టారాజ్యంగా స్టోన్ క్రషర్లు • నిషేధిత ప్రాంతంలోనూ నిర్వహణ
- గాలి, నీరు కలుషితం • బినామీలతో నేతల భారీ దందా

నవ తెలంగాణ- దుబ్బాక

కొండలను పిండి చేస్తున్నారు. నేల, నీరు కలుషితమవుతున్నా వారికి లెక్కేలేదు. నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఇదీ సిద్దిపేట జిల్లా దుబ్బాక పరిసర ప్రాంతాల్లో కంకర మిల్లుల (స్టోన్ క్రషర్లు) పరిస్థితి. క్రషర్లు, హాట్ మిక్స్ ప్లాంట్ లతో గాలి ,పంట పొలాలు ,నీటి వనరులు కాలుష్యం బారిన పడుతున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా 600 కు పైగా కంకర మిల్లులు ఉన్నట్లు సమాచారం. విద్యుత్, జనరేటర్లతో నిరంతరాయంగా నడిపిస్తున్నారు. కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులు, నేతలు బినామీ పేర్లతో పెద్ద ఎత్తున ఈ వ్యాపారం చేస్తున్నారు.కంకరను తరలించేందుకు భారీ ట్రక్కులను ఉపయోగిస్తూ ఉండడం "కంకర మాటున కాసుల దందా "ఏ స్థాయిలో జరుగుతుందో అనడానికి ఓ ఉదాహరణ.

తమదంటే తమ పరిధి కాదంటున్న అధికారులు

స్టోన్ క్రషర్లు, హాట్‌మిక్స్ ప్లాంట్ల నిర్వహణ ఏర్పాటు నిబంధనల అమలును పరిశ్రమల శాఖ, మైనింగ్ శాఖ, విద్యుత్ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి వంటి పలు విభాగాలు పర్యవేక్షించాలి.కానీ ఆయా శాఖల అధికారులు ఒకరిపై ఒకరు తమదంటే తమ పరిధిలోకి రాదని చేతులు దులిపేసుకుంటున్నారు. నిబంధనల అమలులో చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో నిర్వాహకులది ఇష్టారాజ్యంగా మారిపోయింది.సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక పరిధిలోని చెల్లాపూర్ వార్డు పరిధిలో క్వారీ క్రషింగ్ కార్యకలాపాలపై నిషేధం ఉంది.అయినా ఇక్కడ పెద్ద ఎత్తున స్టోన్ క్రషింగ్ జరుగుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వందకు పైచిలుకు క్రషర్లు ఉన్నట్లు సమాచారం.రహదారులు ఇళ్ళ నిర్మాణానికి కంకర ,రాతిపొడి చాలా ముఖ్యమే. కానీ వాటి తయారీలో జరుగుతున్న లోపాలు ఇబ్బందికరంగా మారుతున్నాయి .నీటి వనరులు, పంట పొలాలకు,అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఈ మిల్లుల వల్ల తీవ్ర సమస్య తలెత్తుతుంది. క్రషర్లతో పర్యావరణానికి, చుట్టుపక్కల పంటలకు,గ్రామాల ప్రజల ఆరోగ్యానికి నష్టం జరుగుతుందని స్థానికులు వాపోతున్నారు.నిబంధనల ప్రకారం క్వారీలకు అనుమతి తీసుకుని పరిమితి మేరకే రాళ్లను తవ్వాల్సి ఉంది.అనుమతి ఒకచోట తీసుకొని మరోచోట తవ్వుతున్నట్లు ఆరోపణలున్నాయి.

తగ్గుతున్న పంటల సారం

క్రషర్ల నుంచి వెలువడే దుమ్ముతో తమ జీవనం దుర్భరంగా మారుతుందని చెల్లాపూర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాతిపూడి, దుమ్ము వలన సరైన దిగుబడి రావట్లేదని రైతులు ఊసూరుమంటున్నారు. కంకరతో వచ్చే దుమ్ము ధూళితో నిత్యం నరకం అనుభవిస్తున్నామని ఉన్నతాధికారులు క్రషర్ల యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య

నవతెలంగాణ-మర్కుక్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. మండల పరిధిలోని వరదరాజపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో యువత చిన్న చిన్న సమస్యలకే ఆవేశాలకు లోనవుతోందన్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. కుటుంబ సమస్యలపై కలిసిమెలిసి పరిష్కరించుకోవాలన్నారు. పండుగల సందర్భంగా ప్రజలంతా ఐక్యంగా నిర్వహించుకోవాలన్నారు. నేడు సోషల్ మీడియా జీవితంలో భాగమైందని దానిని అవసరానికి తప్ప కాలయాపన చేస్తూ, దాని ద్వారా జీవితాన్ని ఇబ్బందుల్లోకి పెట్టుకోకూడదన్నారు. పండుగలను, గుడుల ప్రారంభాలను మార్కెటింగ్ చేస్తు ప్రజా సమస్యలను ముందుకు రాకుండా ప్రజల యొక్క ఆలోచనలను పక్కతోవ పట్టిస్తున్నారన్నారు. మణిపూర్లో వేలాది మంది మహిళలపై దాడులు అత్యాచారాలు హత్యలు జరిగాయని, దీని పై ప్రధానమంత్రి అక్కడ మాత్రం పర్యటించ లేదన్నారు. భారత పార్లమెంట్ కు అధిపతి అయిన రాష్ట్రపతిని పార్లమెంట్ ఉత్సవానికి పిలవలేదన్నారు. సమాజంలో అంతరిక్షంలోకి వెళ్లి పరిశోధనలు చేస్తున్న అన్ని రంగాల్లో మహిళలు పనిచేస్తున్న నేటికీ మహిళల పట్ల వివక్షత కొనసాగుతుందన్నారు. మహిళలు ఐక్యమంగా ఉద్యమాలు చేస్తూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు బాలలక్ష్మి ,మండల కో ఆప్షన్ సభ్యురాలు లక్కాకుల సాహెరా నరేష్,, పంతులు స్వప్న ,లక్ష్మీ ,భారతమ్మ సుజాత, తదితరులున్నారు.

జహీరాబాద్ స్టేడియం అభివృద్ధికి కృషి



మాజీ మంత్రి టి హరీశ్‌రావు

నవతెలంగాణ జహీరాబాద్

జహీరాబాద్ స్టేడియం అభివృద్ధికి కృషినని మాజీ మంత్రి టి హరీశ్‌రావు అన్నారు. జహీరాబాద్ క్రీడలకు మారుపేరని, ఇక్కడి స్టేడియంను హెచ్సీఏ నిధులు తెచ్చి ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు సహకారంతో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలో ఖీజర్‌యాపై గోల్డ్ కప్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా కన్స్యూమ్ కమిటీ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్‌లో ఇంటర్నేషనల్ స్థాయికి తగ్గట్టు టోర్నమెంట్ నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇలాంటి క్రీడలు యువత నూతనోత్సాహంతో మరింత రాణించగలుగుతారన్నారు. దేశంలో జహీరాబాద్ పేరు మారుమోగుతుందన్నారు. ఆలిండియా తంజీం కమిటీ సభ్యులు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరకదారుఢ్యం కలుగుతుందన్నారు. 30 వేల మంది వీక్షించే విధంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్ విజేతగా ధారాసింగ్ ఎలెవన్ సంగారెడ్డి జట్టు నిలిచింది. ఖీజర్‌యాపై గోల్డ్ కప్ ఫైనల్ పోటీల్లో ధారాసింగ్ ఎలెవన్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ చేస్తూ నిర్ణిత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేయగా శేకపూర్ సిసి 196 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శేకపూర్ జట్టు 20 ఓవర్లలో 182 పరుగులకు అలౌట్ అవ్వడంతో 13 పరుగుల తేడాతో శేకపూర్ సిసిపై విజయం సాధించి ఛాంపియన్‌గా ధారాసింగ్ ఎలెవన్ జట్టు నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జేసీ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా యుద్వీర్ శేకపూర్ నిలిచారు. యుద్వీర్‌కు రూ.50 వేలను జెడ్పీ చైర్మన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి అందజేశారు. ట్రోఫీని మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్, విన్నర్ ట్రోఫీని మాజీ మంత్రి హరీశ్‌రావు, రన్నర్ ట్రాఫిని ఎంపీ బిబి పాటిల్, రన్నర్ జట్టుకు రూ.3.33 లక్షలు ఎమ్మెల్యేలు మణిక్‌రావు, చింత ప్రభాకర్ చేతుల మీదుగా అందించారు. విజేత జట్టు ధారాసింగ్ ఎలెవన్‌కు నేషనల్ హాజీ కమిటీ మేంబర్ ఐజాజ్ హుస్సేన్, ఖిజర్ యపై చేతుల మీదుగా రూ.5.55 లక్షలు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును జెసి కి జైపూర్ కార్పొరేటర్ మొహమ్మద్ జక్రియా చేతుల మీదుగా ఇచ్చారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై నరోత్తం, నియోజకవర్గం లోని వివిధ మండలాల పార్టీల అధ్యక్షులు ,హెచ్సీఎల్ ఉపాధ్యక్షులు దల్జిత్ సింగ్, నిర్వాహక కమిటీ సభ్యులు రాములు నేత ,అబ్దుల్లా, మోతిరాం , యూనూస్, మహబూబ్ అలీ, అబ్దుల్లా విజయ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని పెరకబండ గ్రామానికి చెందిన కర్రావుల మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతుని చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి,రెండో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్,యువజన మండలాధ్యక్షుడు మంకాల ప్రవీన్,కిసాన్ సెల్ జిల్లా నాయకులు చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,టౌన్ అధ్యక్షుడు బండిపెల్లి రాజు,గ్రామస్తులు వడ్లూరీ పర్శరాం పాల్గొన్నారు.

దళితుల భూ సమస్యల పరిష్కారానికి భూ కమిటీ సిఫార్సు చేయాలి



నవ తెలంగాణ- రాయపోల్

తెలంగాణ రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి భూ కమిటీ సిఫార్సులు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. ఆదివారం తెలంగా ణ ప్రభుత్వ ధరణి భూ కమిటీ సభ్యులు భూమి సునీల్‌తో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ సమావేశమయ్యారు. భూ సమస్యలపై చర్చించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ దళితులకు ప్రభుత్వాలు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేసిన భూములను తిరిగి పేదలకు అప్పగించేవిధంగా భూకమిటి తన నివేదికలో పొందుపర్చాలన్నారు.అసైన్డ్ భూములను అన్యాక్రాంత్రం కాకుండా చర్యలను ప్రభుత్వానికి సూచించాలన్నారు.భూ సంస్కరణలను అమలు చేసి భూపంపిణిని చట్టబద్ధం చేయాలని కోరారు. గత ప్రభుత్వం పహణి నుండి తొలగించిన అనుభవదారు కాలాన్ని తిరిగి చేర్చి పేదలకు భూ హక్కులను కల్పించాలన్నారు. వీఆర్ఏ,విఆర్ఓ వ్యవస్థలను పునరుద్దరించాలని కోరారు ఈ రెండు వ్యవస్థల ద్వారా గ్రామాలలో రెవెన్యూ పనులు, గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచార పనులు జరుగుతాయని గత ప్రభుత్వం వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థలను తొలగించి తీరని అన్యాయం చేసిందన్నారు.ప్రజా ప్రయోజనాల పేరుతో ప్రాజెక్టులకు దళితుల భూములను స్వాధీనం చేసుకోకుండా చర్యలు చేపట్టాలని, సమగ్ర సర్వే చేయాలని కోరారు.పేదల భూములకు రక్షణలేని ధరణిని సంస్కరించాలని లేదా రద్దు చేసి పేదల భూములకు చట్టబద్ద రక్షణ కల్పించాలని కోరారు.మహిళ రైతులను రైతులుగా గుర్తించి భూ హక్కులను కల్పించాలన్నారు. సహజమైన భూమిని బతుకుదెరువుగా చూడాలని,రియల్ ఎస్టేట్ మార్కెట్ వస్తువుగా మార్చకుండా సరళమైన ధరలకు పేదలకు భూమి అందుబాటులో ఉంచాలన్నారు.ఈ సమావేశంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన,సత్యం తదితరులు పాల్గొన్నారు.

రాముడి పూజిత అక్షింతల పంపిణీ



నవతెలంగాణ-మర్కుక్

అయోధ్య రాముడి పూజిత అక్షింతలను మండల పరిదిలోని పాతూరు గ్రామంలో ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు గ్రామంలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా తర్వాత తమ ఇంటి ఎదుట 5 దీపాలు వెలిగించి, అక్షింతలను దేవుని వద్ద ఉంచి, కుటుంబసభ్యులపై చల్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ ఉప్పరి అరుణ నర్సింలు, ఉప సర్పంచ్ యువకులు,తదితరులున్నారు.

అభయహస్తం దరఖాస్తుల నమోదు పూర్తి

జిల్లాలో బెజ్జంకి అరుదైన రికార్డు



నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 5 గ్యారంటీల అమలుకు చేపట్టిన అభయహస్తం దరఖాస్తుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయిందని అధికారులు శనివారం తెలిపారు. ప్రభుత్వ నిర్దేశించిన గడువుకు ముందుగా అభయహస్తం దరఖాస్తుల వివరాల నమోదు పూర్తవ్వడంతో జిల్లాలో మొట్టమొదట స్థానంలో నిలిచి అరుదైన రికార్డులో నిలిచింది బెజ్జంకి మండలం. మండల వ్యాప్తంగా సుమారు 12,020 అభయహస్తం దరఖాస్తులను ప్రజల నుంచి అధికారులు స్వీకరించారు. పారదర్శకత పాటిస్తూ వివరాల నమోదు ప్రక్రియ పూర్తి చేశామని ఎంపీడీఓ దమ్మని రాము, తహసిల్దార్ శ్యామ్ తెలిపారు. అభయహస్తం వివరాల నమోదులో బెజ్జంకి మండలం అరదైన రికార్డును నెలకొల్పడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

గ్రామాల్లో స్వీకరించిన దరఖాస్తులు

బెజ్జంకి(1716), బెజ్జంకి క్రాసింగ్(137), లక్ష్మీపూర్(577), వీరాపూర్(268), గుగ్గీల్ల(660), తిమ్మాయిపల్లి(156), తోటపల్లి(813), దేవక్కపల్లి(360), దాచారం(807), ముత్తన్నపేట(196), బేగంపేట(751), గూడెం(376), గాగీల్లాపూర్(648), నర్సింహులపల్లి(130), వడ్లూర్((611), తలారివానిపల్లి(155), రేగులపల్లి(760), పెరుకబండ(227), చీలాపూర్(454), చీలాపూర్ పల్లి(222), కల్లెపల్లి(922), పోతారం (194), గుండారం(880) దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. మరో 905 దరఖాస్తులు ఇతర అవసరాల కోసం ప్రజలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు.

మిషన్ ఆపరేట్ చేస్తూ కార్మికుడి మృతి



నాగులపల్లి ఎస్వీఎస్ కన్‌స్ట్రక్షన్స్‌లో ఘటన

నవ తెలంగాణ - పటాన్ చెరు

మిషన్ ఆపరేట్ చేస్తూ అదే మిషన్ తగిలి కార్మికుడు మృతి చెందిన ఘటన నాగులపల్లి ఎస్వీఎస్ కన్ స్ట్రక్షన్స్‌లో చోటుచేసుకుంది. భానూర్ బీడీఎల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చంద్రంపేట గ్రామం సాలూరు మండలం విజయనగరం జిల్లాకు చెందిన చింత కుర్మా నాయుడు(34) విశాఖపట్నంలోని ఎస్వీఎస్ కన్ స్ట్రక్షన్స్ లో పవర్ బూమ్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. సంక్రాంతి పండుగకు నాలుగు రోజుల ముందే రామచంద్రాపురం మండలం నాగులపల్లిలోని ఎస్వీఎస్ కన్ స్ట్రక్షన్స్‌కు బదిలీపై వచ్చాడు. శనివారం సాయంత్రం పవర్ బూమ్ మిషన్ ఆపరేట్ చేస్తుండగా మిషన్ కుర్మా నాయుడు తలకు బలంగా తగిలింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు అడుగగా సంస్థ నుంచి ఇచ్చేది లేదని మొండికేయడంతో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. రూ.5.50 లక్షలు, దహనసంస్కారాలకు మరో రూ.50 వేలు, సంస్థ నుంచి వచ్చే బెనిఫిట్స్ ఇచ్చేందుకు అంగీకరించారు. మృతుడి తమ్ముడు లోకేశ్వరరావు ఫిర్యాదు మేరకు బీడీఎల్ ఎస్ ఐ శివకుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఓవర్టేక్ చేయబోయి కారుబోల్తా



ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

ఆర్టీసీ బస్సును ఓవర్టేక్ చేయబోయి కారు బోల్తా కొట్టడంతో ఒకరు మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం హుస్నాబాద్ పట్టణ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హుస్నాబాద్ పట్టణానికి చెందిన ఎగ్గోజు యశ్వంత్, నారోజు వెంకటేష్, ఎగ్గోజు అఖిల్, కేమ్మసరం అజయ్ నలుగురు స్నేహితులు కలిసి పొట్లపల్లి గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి, సుందరగిరి గ్రామంలోని వెంకటేశ్వర స్వామిని దర్శనం కోసం వెళ్లారు. తిరుగి వస్తున్న క్రమంలో కరీంనగర్ రోడ్ లోని పట్టణ శివారులో ఆర్టీసీ బస్సును ఓవర్టేక్ చేస్తున్న క్రమంలో బస్సు ముందు ఉన్న బైకును తప్పించబోయి నాలుగు పల్టీ కొట్టింది. దీంతో కారులో ఉన్న యశ్వంత్(17) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గాయా లైన ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు. యశ్వంత్ మృ తదేహాన్ని ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. విషయం తెలు సుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
సోమవారం | 15 జనవరి 2024 | www.navatelangana.com

తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం సంగారెడ్డి జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పీపీ రాథోడ్, జిల్లా అధ్యక్షులు ఎం.మంజ్యా నాయక్, దేవిసింగ్ చౌహాన్,అర్జున్ చౌహాన్, తులసి రామ్ రాథోడ్, రగ్య నాయక్, దేవిసింగ్ రాథోడ్, హరి నాయక్ రాథోడ్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు గాలిపటాలు పంపిణీ



నవతెలంగాణ-హత్నూర

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వల్లిగారి సాయికుమార్ మండల కేంద్రమైన హత్నూరలో చిన్నారులకు ఆదివారం గాలిపటాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడ్రోజులపాటు గ్రామాల్లో జరిపే మకర సంక్రాంతి వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన డానికి గాలిపటాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. అయితే గాలిపటాలు ఎగురవేసే సమయంలో చిన్నారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గాలిపటాలు ఎగరవేస్తున్న క్రమంలో చిన్నారుల దృష్టంతా వాటిపైనే ఉండడంతో అక్కడక్కడ కొన్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండి ఆనందంగా పండుగ జరుపుకోవాలన్నారు.



పండుగ పూట విషాదం..

- విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి
- మృతుడి భార్య, పిల్లలకు కూడా గాయాలు
- హై టెన్షన్ వైర్లకు చిక్కుకున్న గాలిపటాన్ని తీసే ప్రయత్నంలో దుర్ఘటన..



నవతెలంగాణ-జోగిపేట

సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా జరుపుకోవాలని భార్య, పిల్లలతో మామయ్య ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి.. విద్యుద్ఘాతంతో మృతి చెందాడు. హైటెన్షన్ వైర్లకు చిక్కుకున్న గాలిపటాన్ని తీసే ప్రయత్నంలో విద్యుద్ఘాతానికి గురయ్యాడు. ఈ విషాదకర ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని జోగిపేట పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ప్రత్యక్ష సాక్ష్యులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్ ప్రాంతంలో గల ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం(35) సంక్రాంతి పండుగ సందర్భంగా తన భార్య, పిల్లలతో కలిసి జోగిపేటలో నివాసముంటున్న మామ ప్రసాద్ ఇంటికి వచ్చారు. ఆదివారం ఉదయాన్నే బిల్డింగ్‌పై పిల్లలతో కలిసి గాలిపటాలు ఎగురవేసి అందరూ ఆనందంగా గడిపారు. అయితే పిల్లలు ఎగురవేస్తున్న గాలిపటం బిల్డింగ్‌కు సమీపంలో ఉన్న హై టెన్షన్ వైర్లకు తగిలింది. ఈ క్రమంలో ఆ వైర్ల నుంచి గాలిపటాన్ని తీయడానికి సుబ్రహ్మణ్యం ప్రయత్నించగా.. ఒక్కసారిగా కరెంట్ షాక్ తగిలింది. దాంతో అతడు రెండంతస్తుల భవనం పై నుంచి కిందపడిపోగా.. తీవ్ర గాయాలయ్యాయి. అయన్ను ముందుగా స్థానిక జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. కాగా భర్తను కాపాడబోయే క్రమంలో మృతుని భార్య చాముండేశ్వరికి గాయాల య్యాయి. అలాగే వారి ఓ కుమారుడికి కూడా గాయాలు అయ్యాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా మృతుడి స్వస్థలం కృష్ణాజిల్లా గుడివాడ ప్రాంతంగా తెలుస్తోంది.

జోరుగా అక్రమ మట్టి తవ్వకాలు

- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- పట్టించుకోని అధికారులు
- ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటాం : తహసీల్దార్





నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ ఉమ్మడి మండల పరిధిలో మట్టి వ్యాపారం విచ్చలవిడిగా కొనసాగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రతీరోజు వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ప్రభుత్వ భూముల నుంచి దళారులు మట్టిని తరలిస్తున్నారు. అక్రమంగా సాగిస్తున్న ఈ దందాతో లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరిగినా ఏ ఒక్క అధికారి అటువైపు కన్నెత్తి చూడకపోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి మండలంలోని చాలా గ్రామాల్లో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తోంది. ప్రభుత్వ భూముల్లో నుంచి అన్యాక్రాంతంగా జేసీబీలతో మట్టిని తొవ్వి.. ప్రతీరోజు వ్యాపారం సాగిస్తున్నారు. దాంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి ఏర్పడుతుంది. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్పటికీ.. అదిగో చూస్తాం, ఇదిగో చూస్తాం అంటు న్నారు తప్పా చర్యలు తీసుకోవట్లేదని పలువురు ఆరోపిస్తు న్నారు. ఇదే విషయమై పాత్రికేయులు ప్రశ్నిస్తే.. ఈ విష యంపై వార్తలు రాస్తే మీ అంతు చూస్తామంటూ బెదిరిస్తు న్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఈ అక్రమ దందాపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. లేని యెడల అన్ని గ్రామాల ప్రజలు ఏకమై జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎతున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఛలో సెక్రటేరియట్ చేపడుతామన్నారు.

ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటాం



నేను ఇటీవలే ఇక్కడ బాధ్యతలు చేపట్టాను. ఈ మట్టి అక్రమ రవాణా గురించి కొన్ని గ్రామాల ప్రజలు నాకు ఫోన్ ద్వారా తెలిపారు. దాడులు కూడా చేశాం. కానీ మేము పోయే సరికి వారు అక్కడ లేరు. ఇలాంటి అక్రమ దందా ఎక్కడ చేపట్టినా ఉపేక్షించబోము. ఎంతటి వారైనా చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

-భాస్కర్, పుల్కల్ తహసీల్దార్

రేజింతల్ ఆలయం జనసంద్రం

- ఘనంగా సాగిన ఆలయ జయంతి ఉత్సవాలు
- హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు, ప్రముఖులు

నవతెలంగాణ-న్యాల్‌కల్

సంగారెడ్డి జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన రేజింతల్ సిద్ధి వినాయక ఆలయ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మూడ్రోజుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పెద్ద సంఖ్యలో ఆలయానికి భక్తులు విచ్చేశారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు వివిధ పట్టణాల నుంచి పెద్ద ఎత్తున సందర్శకులు ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. 58 యజ్ఞ గుండాల్లో 300 మంది దంపతులతో మూడు గంటల పాటు హోమ పూజలు నిర్వ హించారు. వేద పండితుడు గిరీష్ జోషి వేద మంత్రాలతో పూజలు ఆద్యాంతం భక్తితో కొనసాగాయి. భక్తులకు ఎలా ంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.అలాగే అన్నదానం కూడా చేపట్టారు.

యజ్ఞంలో పాల్గొన్న ప్రముఖులు..

ఈ యజ్ఞ పూజల్లో మాజీమంత్రి, ప్రస్తుత సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, జహీరాబాద్ ఎంపీ బిబి పాటిల్, ఎమ్మెల్యే మాణిక్ రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజు శ్రీ జయపాల్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మెన్ మల్కాపురం శివకుమార్, నరోత్తం, తన్వీర్, ఉమాకాంత్ పాటిల్ పాల్గొన్నారు. కాగా వారిని ఆలయంలోకి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారికి హారతి పూజలు చేశారు. ఈ ఉత్సవంలో సర్పంచ్ కుతుబుద్దీన్, మండల నాయకులు కొత్తపల్లి భాస్కర్ రెడ్డి, రవీందర్, నరసింహారెడ్డి, రాజ్ కుమార్, ఆలయ ట్రస్ట్ అల్లాడి నర్సింలు, అశోక్ సెట్, నారాయణరావు, నీల రాజేశ్వర్, తదితరులు భక్తులు పాల్గొన్నారు.









ఘనంగా స్మారక క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన సారా నరేష్ గౌడ్ జ్ఞాపకార్థం ఆయన సోదరుడు మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో స్మారక క్రికెట్ పోటీలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 40 జట్టులు పాల్గొనగా.. పెద్ద గొటిముక్కులకు చెందిన టీం విజేతగా నిలిచింది. జిన్నారానికి చెందిన టీం రెండో స్థానం సాధించింది. గెలిచిన టీంలకు నిర్వాహకులు నగదు ప్రైజ్ మనీ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. తన సోదరుడు సారా నరేష్ గౌడ్ జ్ఞాపకార్థం ఐదోసారి ఈ క్రికెట్ పోటీలను నిర్వహించినట్టు చెప్పారు. యువత చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలన్నారు. క్రీడల ద్వారా యువతకు ఒత్తిడి తగ్గడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణకర్ గౌడ్, రాహుల్ యాదవ్, హరీష్ గౌడ్, నరేష్ ముదిరాజ్, రవి, అంజి, మణికంఠ,సురేష్, రాకేష్, వార్డు మెంబర్ రాము తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు

- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ప్రత్యూష రెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైయస్సార్ కాలనీలో ఆదివారం సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వ హించారు. ఈ పోటీలకు వి.ప్రత్యూష రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అందమైన రంగవల్లులు వేసి విజేతలుగా నిలిచిన మహిళలకు ఆమె బహుమతి ప్రదానం చేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 100మంది మహిళలకు కమిటీ సభ్యులతో కలిసి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలోని మహిళలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మూడు రోజుల సంక్రాంతి పండుగను ప్రజలంతా సుఖ:సంతోషాలతో జరుపు కోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిద్ధి వినాయక కమిటీ సభ్యులు, కాలనీ మహిళలు పాల్గొన్నారు.




కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి అన్నారు. శ్రీకాకుళం నుంచి వచ్చి గత 30 ఏండ్లుగా బొల్లారం మున్సిపల్ ప్రాంతంలో ఉంటున్న కళాకా రులకు హార్మోనియం పెట్టెను కృష్ణారెడ్డి అందజేశారు. తన తండ్రి కొత్వాల్ జయరాం రెడ్డి జ్ఞాపకార్థం హార్మోనియం పెట్టెను అందజేశానని.. ఇక మీదట తమ కళలతో ప్రజలను మెప్పించాలని కళాకారులను ఉద్దేశించి అన్నారు. కళాకారు లు కనుమరుగై పోతున్న తరుణంలో.. కళలను కాపాడ టానికి సహకారం అందించడం గొప్పవిషయమని కళాకారు లు అన్నారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-రాయికోడ్

మండల కేంద్రమైన రాయికోడ్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమా వేశంలో పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. ఎంత ఎత్తుకు ఎదిగినా విద్యార్థి దశ మరువలేదన్నారు. విద్యార్థి దశలోని తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విట్టల్‌ను సన్మానించారు.కార్యక్రమ ంలో అనిల్,గోపాల్, సాయిబాబా, హనుమంతు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



నవతెలంగాణ-పుల్కల్

సంక్రాంతి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పుల్కల్ ఎస్సై క్రాంతి కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గాలిపటాలు ఎగిరేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెట్లు, విద్యుత్ తీగలపై గాలిపడాలు పడితే.. వాటిని తీసేందుకు ప్రయత్నాలు చేసి విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దనిన్నారు. చిన్నపిల్లలు బిల్డింగ్‌లపై ఎక్కి గాలిపటాలు ఎగరేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు అశ్రద్ధ వహించకుండా పిల్లలకు తగు సూచనలు చేస్తూ.. ఎప్పటికప్పుడు వారిని పర్యవేక్షిస్తు ఉండాలన్నారు. పండుగ పురస్కరించుకొని మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాబట్టి ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుని.. పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు.

సంస్కృతీ సంప్రదాయాల్లో ముగ్గులకు ఎంతో విశిష్టత

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- బీఆర్ఎస్ నాయకులు అబేద్ ఆధ్వర్యంలో 11 ఏండ్లుగా ముగ్గుల పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేత



నవతెలంగాణ-పటాన్‌చెరు

హిందూ సంస్కృతి సంప్రదాయాల్లో ముగ్గులకు ఎంతో విశిష్టత ఉందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మకర సంక్రాంతి పండుగను పురస్క రించుకుని ఆదివారం మండల పరిధిలోని ముత్తంగి సాయి ప్రియ కాలనీలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆబేద్ ఆధ్వర్యంలో 11 ఏండ్లుగా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్రాంతి పర్వ దినం పురస్కరించుకొని గత 11 ఏండ్లు మహిళల కోసం ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం అభి నందనీ యమన్నారు. పండగ విశిష్టతను ప్రతిబింబించేలా ముగ్గులు వేయడం పట్ల ఆయన మహిళలకు ప్రత్యేక అభిన ందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో మొదటి విజేతకు వాషింగ్ మిషన్, రెండో బహుమతి గ్రైండ ర్, మూడో బహుమతి మిక్సీ, నాలుగో బహుమతి ఎలక్ట్రిక్ కుక్కర్ తో పాటు పోటీలో పాల్గొన్న 170 మంది మహిళలకు కన్సో లేషన్ బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నాగేష్, సర్పంచ్ ఉపేం దర్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, ఉపసర్పంచ్ లింగా రెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మేరాజ్ ఖాన్, శ్రీనివాస్ రెడ్డి, సందీప్, రామకృష్ణ, అబ్దుల్ ఫయిజ్, సోహెల్, అబ్దుల్ ఖదీర్, వెం కటేష్, అర్జున్ పాల్గొన్నారు.



వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో పతంగులు పంపిణీ



నవతెలంగాణ-సంగారెడ్డి

సంక్రాంతి పండగ సందర్భంగా స్థానిక మాణిక్ ప్రభు మందిర్‌లో వాసవి క్లబ్స్ సంగారెడ్డి ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు పతంగుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు వివిఎన్ చందా శ్రీధర్, అంతర్జాతీయ, అంతర్జాతీయ జాయింట్ సెక్రెటరీ వి.ఎన్ పుల్లూరి ప్రకాష్, జిల్లా వైస్ గవర్నర్ వివిఎన్ ఇరుకుల్లా ప్రదీప్, జిల్లా ఇంచార్జ్ వి ఎన్ కొంపల్లి విద్యాసాగర్, జిల్లా, వి ఎన్ వనం నరేందర్, వి ఎన్ నామ శ్రీనివాస్, వివిఎన్ కటకం శ్రీనివాస్, వివిఎన్ చిలమకూరి నరేంద్ర, వివిఎన్ నామ భాస్కర్, వివిఎన్ కొండూరి రామ్మోహన్, వివిఎన్ చంద శ్రీదేవి, జిల్లా కో -ఆర్డినేటర్, లక్ష్మణ్, పాంపాటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విజయానికి నిబద్ధత అవసరం

శ్రీ అక్షయ జూనియర్ కాలేజ్ ఫేర్వెల్ డేలో సినీ దర్శకుడు కె.వి అనుదీప్



నవతెలంగాణ-సంగారెడ్డి

ఏ రంగమైనా విజయానికి నిబద్ధత అవసరమని సినీ దర్శకుడు కేవీ.అనుదీప్ అన్నారు. శ్రీ అక్షయ జూనియర్ కాలేజ్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ముఖ్యఅతిథిగా జాతి రత్నాలు సినిమా దర్శకుడు కె.వి అనుదీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఎంచుకున్న రంగంలో పట్టువదలకుండా కృషి చేసినట్లయితే ఏదో ఒక రోజు వారికి విజయం సొంతం అవుతుందన్నారు. కాగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సంస్కృతి కార్యక్రమా లు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండె ంట్ వీరప్ప, ప్రిన్సిపాల్ శ్రీశైలం డైరెక్టర్లు సుధాకర్ జోషి రాజు గౌడ్ భానుచందర్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



మానవసేవే మాధవసేవ

ఆల్ ఇండియా సంస్థ సైనికుల రాష్ట్ర నిర్మాణ కార్యదర్శి కాసాల అంబదాస్

నవతెలంగాణ-జిన్నారం

'మానవసేవే మాధవసేవ' అని దళిత రత్న, ఆల్ ఇండియా సంస్థ సైనికుల రాష్ట్ర నిర్మాణ కార్యదర్శి కాసాల అంబదాస్ అన్నారు. జిన్నారం మండలంలోని మాదారానికి చెందిన అంబదాస్.. తన కుమారుడు రోహిత్ జన్మదిన వేడుకలను మదర్ మేరీ వృద్ధాశ్రమంలో ఆదివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాకులు, అనాధ వృద్ధులతో కలిసి కేక్‌కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నిర్మాణ కార్యదర్శి దళితరత్న కె.అంబదాస్,కే.రోహిత్, వృద్ధాశ్రమ ఫౌండర్ ఫౌండర్ ఉదయ, మేరీ బృందం పాల్గొన్నారు.

నవతెలంగాణ
మెదక్
సోమవారం | 15 జనవరి 2024 | www.navatelangana.com

పారిశుద్ధ్య కార్మికులు... సామాజిక వైద్యులు



మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

నవతెలంగాణ-సిద్దిపేట

పారిశుద్ధ్య కార్మికులు సామాజిక వైద్యులనీ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్వచ్ సర్వేక్షన్‌లో దక్షిణ భారత దేశంలోనే సిద్దిపేటకు క్లీన్ సిటీ అవార్డ్ వచ్చిన నేపథ్యంలో మున్సిపల్ కార్మికులను హరీశ్ రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. క్లీనెస్ట్ సిటీ ఆఫ్ తెలంగాణ అండ్ సౌత్ ఇండియాగా సిద్దిపేట అవార్డు (చెత్త సేకరణలో సమర్థవంతంగా నిర్వహణ) సాధించడం మనందరికీ గర్వకారణమన్నారు. ఇందుకు కృషి చేసిన మున్సిపల్ కార్మికులు, కౌన్సిలర్లు, అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ అవార్డు సిద్దిపేట ప్రజలకు అంకితమన్నారు. ప్రజల భాగస్వామ్యం లేనిది అనుకున్న లక్ష్యం నెరవేరడం సాధ్యం కాదన్నారు. వైద్యులు రోగాలు వచ్చిన తర్వాత చికిత్స అందిస్తే, మీరు రోగాలు రాకుండా కాపాడుతున్న సామాజిక వైద్యులన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడుతున్న సఫాయి అన్నా మీకు సలామని, మున్సిపల్ అధికారులు సిబ్బందికి చేతులెత్తి మొక్కుతున్నానన్నారు. అవార్డు అంటే సిద్దిపేట... సిద్దిపేట అంటే అవార్డు అనే స్థాయిలో చేరిందన్నారు. 22 జాతీయ అవార్డులు సాధించిన ఘనత సిద్దిపేటకు దక్కిందన్నారు. రాష్ట్రం ఒకే ఒక్క మున్సిపాల్టీకి జాతీయ స్థాయి అవార్డు ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి అభినందనలు తెలపని పరిస్థితి ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎక్కడ అవార్డు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం పిలిచి అభినందించే సంస్కృతి ఉండేదన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తరుపున అభినందన ట్వీట్, ప్రెస్ నోట్ కూడా నోచుకోలేని దుస్థితిలో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, కమిషనర్ సంపత్ కుమార్, వైస్ చైర్మన్ కనకరాజు, కార్మికులు పాల్గొన్నారు.

వరుస చోరీలు.. పసిగట్టని పోలీసులు

వతెలంగాణ-కొల్చారం

మండలంలోని పలు గ్రామాలలో దేవాలయాల్లో వరుసగా జరుగుతున్న చోరీల సంఘటనలు పోలీసులకు సవాలుగా మారాయని చెప్పుకోవచ్చు. నెల రోజుల వ్యవధిలో మండలంలోని మూడు ప్రధాన ఆలయాలలో చోరీల సంఘటనలు వరుసగా వెలుగు చూస్తున్నాయి. గత 25 రోజుల క్రితం



ఎనగండ్ల శివారులోని దుంపలకుంటలో ఉన్న ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. అది మరువక ముందే మరో నాలుగు రోజుల క్రితం అదే ప్రాంతంలోని సేవాలాల్ మందిరంలో చోరీ జరిగింది. ఈ రెండు సంఘటనలలో ఆయా ఆలయాలలోని ఎంపిల్ వైర్ సెట్లు, సిసి కెమెరాల సిపియు తదితర విలువైన ఎలక్ట్రానిక్ సామాగ్రితో పాటు ఉత్సవ విగ్రహాలు, బంగారు ఆభరణాలు, హుండీలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నది. ఆయా సంఘటన స్థలాన్ని జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు సైతం పరిశీలించారు. ఇదిలా ఉండగా మరో చోరీ శనివారం రాత్రి అంసానిపల్లి గ్రామ సమీపంలోని చెరువు కట్టపై ఉన్న గంగమ్మ దేవాలయం హుండీని గుర్తుతెలియని దుండగులు పగలగొట్టడంతో పాటు ఆలయంలోని విగ్రహానికి ఉన్న విలువైన బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. విషయం తెలుసుకున్న కొల్చారం ఎస్సై మహమ్మద్ గౌస్ తో పాటు క్లూస్ టీం సభ్యులు పరిశీలించారు. ఈ సంఘటనలో సుమారు లక్ష రూపాయల వరకు చోరీ జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు రమేష్ తెలిపారు. పోలీసులు వెంటనే దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బాలికల విభాగంలో నల్లగొండ, బాలుర విభాగంలో రంగారెడ్డి జట్ల విజయం



నవతెలంగాణ -గజ్వేల్ : తెలంగాణ రాష్ట్ర 49వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో చివరి రోజైన ఆదివారం రాత్రి గజ్వేల్ పట్టణంలో పోటీలు జరిగాయి. ఇందులో బాలికల విభాగంలో రంగారెడ్డిపై నల్లగొండ బాలికల జట్టు విజయం సాధించింది. బాలుర జట్టులో నల్లగొండపై రంగారెడ్డి బాలుర జట్టు విజయం సాధించింది. ఇందులో భాగంగా రంగారెడ్డి బాలికల జట్టుకు 42 పాయింట్లు రాగా నల్లగొండ బాలికల జట్టుకు 55 పాయింట్లు వచ్చాయి. దీంతో రంగారెడ్డి బాలిక జట్టుపై 13. పాయింట్ల తేడాతో నల్లగొండ బాలికల జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో నల్లగొండ వర్సెస్ రంగారెడ్డి పోటీపడ్డారు. నల్లగొండ బాలుర జట్టుపై ఏడుపాయింట్ల తేడాతో రంగారెడ్డి జిల్లా బాలుర జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జగదీష్ యాదవ్, తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, టూరిజం మాజీ చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వాలీబాల్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రాజు, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ కుమార్, స్పోర్ట్స్ స్పోకెన్ చిన్నకృష్ణ, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, కౌన్సిల్ సభ్యులు ఉప్పల మెట్టయ్య, భాగ్యలక్ష్మి దుర్గ ప్రసాద్, రహీం, శ్యామల మల్లేశం యాదవ్, కోఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు పాల్గొన్నారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

నవతెలంగాణ - చేగుంట



చేగుంట మండలంలోని అన్ని గ్రామాల ప్రజ లకు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎంపీపీ మాసుల శ్రీనివాస్ మకర సంక్రాంతి, కనుమ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడిపంటలు, సిరిసంపదలు వెలసిల్లాలని, కోరుకుంటున్నామన్నారు. ఇటీవల వాట్సప్‌లలో వస్తున్న మూఢనమ్మకాల వదంతులను ప్రజలు ఎవరు నమ్మవద్దన్నారు. ఒక్క కొడుకున్న వాళ్ల గాజులు పెట్టుకోవడం, అల్లుళ్లకు పాలతో కాలు కడిగి తులం బంగారం పెట్టమనడం ఇవన్నీ మూఢనమ్మకాలేనన్నారు. ఇటువంటి మూఢ నమ్మకాలను ఎవరు నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

నవ తెలంగాణ-సిద్దిపేట

బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో సిద్దిపేట పట్టణ మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మంతెన రాజు నరేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణంలో, నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గానికి తన సహకారం పూర్తి స్థాయిలో ఉంటుందని భరోసా ఇచ్చారు. నియోజవర్గంలో అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు బొమ్మల యాదగిరి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కిష్టారెడ్డి, రాష్ట్ర సేవ దల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా ప్రజలకు మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల సంపదలతో సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందంగా జరుపుకో వాలన్నారు. ఈ సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన కాంతి తీసుకరావాలని ఆకాంక్షించారు. ప్రజలందరు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలన్నారు. పసిడి పంటలతో పరిడ విల్లాలన్నారు. ఈ భోగి పండగ మన అందరికి భోగా భాగ్యాలు ప్రసాదించాలన్నారు. కనుమ పండగ కనువిందుగా జరుపుకోవాలన్నారు. ఈ సంక్రాంతి పండగ ప్రజల జీవితంలో నిత్యం కాంతులు విరిసిల్లాలి అని భగవంతున్నీ కోరుకున్నానన్నారు. ప్రజలందరికి శుభం చేకూరాలని, ఈ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

మున్నూరు కాపులందరినీ ఏకం చేయడమే లక్ష్యం



నవతెలంగాణ-సిద్దిపేట

గ్రామ గ్రామాన తిరిగి మున్నూరు కాపులందరినీ ఏకం చేయడమే లక్ష్యంగా మున్నూరు కాపు సంఘం కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య, నాయకులు పాల సాయిరాం అన్నారు. ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మున్నూరు కాపు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సంఘం నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఫిబ్రవరి 4న వేములవాడలో నిర్వహించ తలపెట్టిన మున్నూరు కాపు నిత్య అన్నదాన సత్రం 11వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను జిల్లా నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరాం, జిల్లా అధ్యక్షుడు నాయకం మల్లయ్య, గౌరవ అధ్యక్షులు సొప్ప పూర్ణ చంద్ర శేఖర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మరిపల్లి నారాయణ, సందుల సతీష్ కుమార్, మ్యాడ శ్రీధర్, అల్లం ఎల్లం, వెంకట రాజం, హరికిషన్, కృష్ణమూర్తి, ఆకుల బాలయ్య, వేణు, బాను తదితరులు పాల్గొన్నారు.

నేడు బండ మల్లన్న జాతర

- ఏండ్ల చరిత్ర కలిగిన మల్లన దేవాలయం
- ముస్తాబైన బండ మల్లన్న జాతర ఏర్పాట్లు

నవతెలంగాణ-మిరుదొడ్డి

మల్లన్న బండ మనకు అండ. కొలిసిన వారికి కొంగుబంగారం సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి జంగాపల్లి ఇరు గ్రామాల పొలిమేరలలో ఉన్న మల్లన్న బండపై ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ పర్వదినాన వందలాది సంవత్సరాల చరిత్ర కలిగిన బండ మల్లన్న జాతర జరుగుతుంది. దాదాపు 120 ఎకరాల విస్తీర్ణం కలిగి 60 గజాల ఎత్తు కలిగి ఉన్న బండపై పరమేశ్వరుడు మల్లన్న దేవుడిగా అవతరించి ఇక్కడే ప్రజల పాలిట కొంగుబంగారంగా అవతరించారని ప్రజల విశ్వాసం. విశాలమైన ఈ బండపై రాజరాజేశ్వర స్వామి దేవాలయం వెంకటేశ్వర ఆలయం పాండవుల విగ్రహాలు, హనుమాన్ దేవాలయం,నాగదేవత ఆలయం, పోచమ్మ దేవాలయంతో పాటు పుట్టుగుండం మల్లన్న పాదముద్రలతో పాటు ఎన్నో దేవత విగ్రహాలు దర్శనమిస్తుంటాయి. ప్రతి ఏటా జనవరి మొదటి వారంలో బండపై బోనాల ప్రారంభంతో సంక్రాంతి సంబరాలు ఆయా గ్రామాల్లో ప్రారంభమై సంక్రాంతి వరకు కొనసాగుతుంది. బండ చుట్టూ ఉన్న గ్రామాలు వీరారెడ్డిపల్లి, జంగాపల్లి, గాజులపల్లి, అల్మాజీపూర్, గ్రామాలకు చెందిన ఎడ్లబండ్లు బండపై కొలువుదీరిన మల్లన్న దేవాలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణ చేయడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. బండపై శాసనసిద్ధంగా వెలసిన పుట్టుగుండంలో దశాబ్దాలుగా గడుస్తున్న బావిలో నీరు ఎన్ని కరువు కాటకాలు ఎదురైనా నేటికీ నీరు పుష్కలంగా ఉండడం మల్లన్న దేవుడి మహిమగా భక్తులు కొనియాడుతున్నారు. పుట్టుగుండంలోని నీరు రైతులు తమ తమ పొలాల్లో చల్లినట్లయితే పంటలు విరివిగా పండుతాయి అని రైతులు గొప్పలుగా చెప్పుకుంటారు. బండ మల్లన్న జాతర అనంతరం రెండు రోజులపాటు వీరారెడ్డిపల్లి జంగాపల్లి జాతరలు జరుపుకోవడం ఈ రెండు గ్రామాల్లో ఆనవాయితిగా వస్తుంది. మల్లికార్జున దేవాలయం సహజసిద్ధంగా వెలిసిన సొరికే లాంటి బండలో వెలిసిన కారణంగా




బండ మల్లన్నగా పేరు ప్రఖ్యాతలుగా ప్రసిద్ధి చెందింది. ఈ జాతరకు వరంగల్, కరీంనగర్ హైదరాబాద్ రంగారెడ్డి నిజామాబాద్ వంటి జిల్లాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి కూడా బండ మల్లన్న స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. పరమశివుని ఆజ్ఞ లేకుండా పార్వతి తన తండ్రి అయిన దక్షరాజు వద్దకు వెళ్లిందన్న కోపంతో దక్షరాజు పైకి దండెత్తి తిరుగు ప్రయాణంలో అలసిపోయి ఈ బండపై సేద తీరుతుండగా చెమటతో నిండిన దేహాన్ని తడుముతూ చేతికి వచ్చిన చెమటను తీసి విసరడంతో సరికలో ఉన్న మట్టి బెడ్డలపై పడడంతో ఓ పసివాడు ఉద్భవించాడని శివుని మారు చెమటతో బండపై వెలసినందున బండ మల్లన్నగా పిలవబడి ఇక్కడి భక్తులు కొలిచే దైవంగా వెలిసి భక్తుల పాలిట కొంగుబంగారమై వర్ధిల్లుమని అంతర్ధానమయ్యాడని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కథలుగా చెప్పుకుంటారు. దీనికి నిదర్శనంగా మల్లన్న బండపై పెట్టిన అడుగు ఇప్పటికీ భక్తులకు దర్శనమిస్తుంది.

భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి

బండ మల్లన్న జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాటు చేసినట్లు ఆయా గ్రామాల సర్పంచులు పన్యాల





వెంకటరెడ్డి కంచం యాదగిరి ఎంపీటీసీ బాల మల్లేశం గౌడ్ ఆలయ కమిటీ ప్రతినిధులు మరియు ఆలయ అర్చకులు, జంగం కొమురయ్య, శ్రీనివాస్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. అనంతరం దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ పరిశీలించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

చివరి వరకు తోడుండేది రామ నామం

ప్రవీణ్‌ను సన్మానించిన రామకోటి సంస్థ



నవతెలంగాణ-గజ్వేల్

శాశ్వతమైనది చివరకు తోడుండేది రామ నామం ఒక్కటే అని రామకోటి సంస్థ అధ్యక్షులు రామరాజు అన్నారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా గజ్వేల్ పట్టణానికి చెందిన వొల్లాల ప్రవీణ్ అనే రామ భక్తుడు ఆదివారం పాదయాత్రగా గజ్వేల్ రామాలయం నుంచి వేములవాడ దేవస్థానానికి బయల్దేరారు. శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపి ప్రవీణ్‌కు కాషాయ జెండాను అందించి సీతారాముల ఫొటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ అయోధ్య రాముని గురించి భక్తులు ఎన్నోరకలుగా తమ భక్తిని చాటుకుంటున్నారన్నారు. వొల్లాల ప్రవీణ్ అనే యువ భక్తుడు భక్తితో రామ నామస్మరణతో కాలి నడకన నడుచుకుంటూ వేములవాడ దేవాలయానికి వెళ్లడం ఆయన భక్తికి నిదర్శనమన్నారు. ఇలాంటి యువ భక్తుడు నేటి యువకులకు ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు బీటుకూరి శ్రీనివాస్, మఠం శివకుమార్, దేశపతి శంకర్ శర్మ వెనవెళ్లి సతీష్, అయిల మహేందర్, సీనియర్ పాత్రికేయులు సత్యనారాయణ పాల్గొన్నారు.

పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

తెలుగు ప్రజల అత్యంత సాంప్రదాయ బద్ధమైన భోగి, సంక్రాంతి పండుగలను ప్రతి ఒక్కరూ ఆనందోత్సహాలతో జరుపుకోవాలని రాష్ట్ర, హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాల భోగి పండుగ సంబరాలు పంచె సంక్రాంతి పండుగ, రైతులకు ఇష్టమైన కనుమ పండుగలను ప్రజలు సంస్కృతి, సంప్రదాయాల నడుమ వైభవంగా జరుపుకోవాలన్నారు. ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని ఆదివారం రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు. పూర్ణ కుంభం



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచరణలతో ఆశీర్వచనం చేసి స్వామి వారి ప్రసాదం అందచేశారు. ఆయనతో పాటు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిస్పందనలో మీడియా భాగస్వామ్యం గొప్పది

- మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధి విషయంలో మీడియా ప్రతిస్పందన గొప్పదని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర 49వ కబడ్డీ క్రీడోత్సవాల ముగింపు సందర్భంగా మీడియా మిత్రులకు ఘనంగా సన్మానం చేశారు. ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం కావడానికి ప్రజలకు తెలియజేస్తున్న మీడియా గొప్పది అన్నారు. అనేక కార్యక్రమాలు చేపట్టిన అవి అక్కడికే పరిమితం కాకుండా ప్రజలకు విషయాన్ని తెలియజేయడంలో గజ్వేల్ మీడియా గొప్ప పాత్ర పోషిస్తుందన్నారు. గత 40 సంవత్సరాలుగా గజ్వేల్ ప్రాంతంలో మీడియా మిత్రులు అభివృద్ధి పై సూచనలు సలహాలు ఇస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో మంచి కవరేజ్ ఇచ్చి ప్రజలకు తెలియజేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రాంతం నుంచి 49 కబడ్డీ టీములు గజ్వేల్ రాగావారికి అన్ని వసతులు కల్పించమన్నారు. ఎలాంటి లోటుపాట్లు రాకుండా నిర్వాకులు కబడ్డీ పోటీలు నిర్వహించి సక్సెస్ అయ్యారన్నారు. సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ పోటీలు గజ్వేల్‌లో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. క్రీడాకారులు ఐకమత్యంగా



ముందుకుండి గెలుపు ఓటములు ఎలా ఉన్నా క్రీడోత్సవాలు విజయవంతంగా జరిగాయన్నారు. క్రీడోత్సవాలు విజయవంతం కావడానికి మీడియా పాత్ర కూడా గొప్పగా ఉందన్నారు. ఈ కార్యక్రమం చేపట్టిన మీడియా భాగస్వామ్యం ఉంటే సక్సెస్ అవుతుందని అనేక కార్యక్రమాల ద్వారా ఋజువైందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, క్రీడల స్పోర్ట్ స్పోకెన్ చిన్ని కృష్ణ, నాయకులు కన్నయాదవ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రాజు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ భారత రాష్ట్ర సమితి యూత్ నాయకులు వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ వేదికగా భవిష్యత్‌లో మరిన్ని క్రీడలు నిర్వహిస్తాం

- సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ కుమార్

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ కేంద్రంగా రానున్న కాలంలో జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడలను గజ్వేల్‌లో నిర్వహిస్తామని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ కుమార్ అన్నారు. ఆదివారం కబడ్డీ స్టేడియంలో మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించిన కబడ్డీ పోటీలు విజయవంతంగా పూర్తయాయన్నారు. దీని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో గజ్వేల్లో జాతీయ రాష్ట్ర క్రీడోత్సవాలను మరిన్ని నిర్వహించేందుకు ఈ క్రీడలు దోహదపడ్డాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు భారీ సంఖ్యలో హాజరయ్యారన్నారు. గజ్వేల్ పట్టణం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేదిక కావడం అభినందనీయమన్నారు. ఈ కబడ్డీ పోటీలలో 33 జిల్లాల నుంచి పాల్గొంటున్న యువతీ యువకులకు శుభాకాంక్షలు తెలిపారు. సుమారు వెయ్యి మందికి క్రీడాకారులు దాకారులు కబడ్డీ కబడ్డీ ఛాంపియన్షిప్లో పాల్గొంటున్నారని, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్రం 33 జిల్లాల నుంచి క్రీడాకారులుతో పాటు వారి వెంట వచ్చిన జిల్లా ఇన్చార్జిలు, పీఈటీలు కబడ్డీ పోటీలు విజయవంతం కావడానికి కృషి చేశారన్నారు. వారికి కావలసిన సౌకర్యాలు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమంతు



సహకారం అందించామన్నారు. బాల బాలికలు స్నేహపూర్వకంగా క్రీడోత్సవాలు నిర్వహించవ ఎన్నారు. గెలుపు ఓటములు ఎలా ఉన్నా బాల బాలికలు విజయం చేరువ కోసం చాలా ప్రయత్నం చేశారన్నారు. నిర్వాకులకు ఎంతో నిర్వాహకులకు సహకరించారన్నారు. దాదాపు 1000 మంది వరకు పాల్గొని క్రీడల విజయానికి కృషి చేశారన్నారు. 49వ జూనియర్ కబడ్డీ ఛాంపియన్ క్రీడోత్సవాలు నిర్వహించమ న్నారు. కబడ్డీ ఛాంపియన్ షిప్ 2023-24 పోటీలను మూడు రోజులపాటు క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఆదివారం రాష్ట్రస్థాయి గెలుపు జట్లను ప్రకటిస్తామ న్నారు మొదటి రోజు గురువారం రాత్రి కబడ్డీ పోటీలను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌ఎసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్, రాజ మౌళి, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్య క్షుడు కాసాని జ్ఞానేశ్వర్రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా క్రీడలు కొనసాగుతున్నాయన్నారు. గజ్వేల్లో రాష్ట్ర స్థాయి క్రీడలు జరగడం గజ్వేలకు గర్వకారణమన్నారు. గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికి గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు, గజ్వేల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. నాలుగు రోజుల పాటు జరుగనున్న పోటీలకు సహకరించాలని ప్రతి ఒక్కరికి సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక మంది క్రీడాకారులు ఉన్నప్పటికీ వారి ప్రతిభను బయటకు తీయలేకపోతున్నామని ఆవేదన చెందారు. క్రీడోత్సవాలు విజయవంతానికి మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ లింగం, రాష్ట్ర కబడ్డి మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మీ, సిద్దిపేట జిల్లాకబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ళ శివకుమార్, స్పోకెన్ మెన్ చిన్ని కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కాసాని వీరేశం. జ్యోతీశ్వర్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, ఎంపిపి దాసరి అమరావతి, స్థానిక కౌన్సిలర్ కీర్ల శ్యామల కనకయ్య, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, తలకొక్కుల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, నాయకులు విరాసత్, వినయ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, హనుమంత రెడ్డి. గంగిశెట్టి రవీందర్, గుంటుకు రాజు, ఉత్తునూరి సంపత్ ఎంతో సహకరించారన్నారు.

మహిళలలో నైపుణ్య పెంచేలా ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

మహిళలలో నైపుణ్యం పెంచేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని పందిల్ల సర్పంచ్ తోడేటి రమేష్, హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ మండలంలోని పందిళ్ల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో గ్రామంలోని మహిళా సోదరిమణులు ఎంతో ఆసక్తికరంగా పాల్గొన్నారు. చిన్నారులు సైతం ముగ్గులు వేయడానికి ముందుకు వచ్చారని, అందరు కూడా ఆకర్షనీయంగా ముగ్గులు వేశారని ఎస్ఐ మహేష్ అన్నారు. ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను ఎంపిక చేయడం చాలా కష్టంగా మారిందని, అందరూ కూడా అద్భుతంగా ముగ్గులు వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, ఉపసర్పంచ్ నెల్లి శ్రీనివాస్, వార్డ్ మెంబర్స్ బొమ్మగాని ఎల్లయ్య, తాడూరి బాబు, రాజేశ్వరి ,చిట్ల మమత, పద్మ, శంకర్ రెడ్డి , తాటికొండ రాజశేఖర్ రెడ్డి , తాడూరి లక్ష్మణ్ , పోలవేణి మహేష్ ,డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గట్ల మల్యాలలో మహిళలకు ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని గట్ల మల్యాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నోముల లింగం ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సందర్భంగా గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 200 మంది మహిళలు పాల్గొని ఆకర్షణీయమైనటువంటి, ఆలోచనత్మాకమైనటువంటి ముగ్గులను వేశారు. కర్ణకంటి యమున ప్రథమ, దొంతి సుకన్య ద్వితీయ, కర్ణకంటి కళ్యాణి తృతీయ కన్సోలేషన్ బహుమతులుగా కాంటారెడ్డి రమ, కర్ణకంటి మీనాక్షిలు గెలుపొందారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా గట్లమల్యాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నోముల లింగం వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ తిప్పని రమేష్, ఎంపీటీసీ రేణుక వేణు, రైతుబంధు మాజీ అధ్యక్షులు ఇంగ నరేష్, గ్రామ ఉప సర్పంచ్ ప్రకాష్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హార్దిక సహాయకులుగా ఎడ్ల సోమిరెడ్డి ఆయిల్ ఫామ్ రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షులు వ్యవహరించారు.గ్రామ సర్పంచ్ తిప్పని రమేష్ మాట్లాడుతూ సాంప్రదాయకమైనటువంటి ముగ్గులు తెలంగాణ యొక్క సంస్కృతి, సాంప్రదాయాలకు



అద్దంపడతాయన్నారు. మహిళలందరూ అన్ని రంగాలలో పాల్గొని తమ పిల్లలను ఉన్నత క్రమశిక్షణ కలిగినటువంటి పౌరులుగా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల నరసింహ్మా రెడ్డి, వంగర నరసింహ్మా రెడ్డి, వరుకోలు లక్ష్మయ్య, మోర గణేష్, తిప్పని అశోక్, తిప్పని రవి, రవీందర్, ఈశ్వర్ రెడ్డి, మోర మోహన్, గంగా భవాని కవిత, రజిత, లక్ష్మి, గ్రామములోని మహిళలు పాల్గొన్నారు.

అభయ హస్తం ఆధ్వర్యంలో ఆవు పిడుకల పంపిణీ

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద ఆదివారం అభయ హస్తం మిత్రబృందం ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ డైరెక్టర్ మురం శెట్టి రాములు సౌజన్యంతో ఆదివారం ఆవు ఆవుపిడుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ, ఇటిక్యాల సర్పంచి రావికంటి చంద్రశేఖర్ మాట్లాడుతూ సంక్రాంతి పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ డైరెక్టర్ పురం శెట్టి రాములు సౌజన్యంతో గత ఐదు సంవత్సరాలుగా ఆవు పిడకల పంపిణీ చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా పాలు పొంగించే కార్యక్రమానికి ఆవు పిడకలు పంపిణీ చేశామన్నారు. ముక్కోటి దేవతలు కొలువైన ఆవు పేడలు పిడకలు, శ్రీ వెంకటేశ్వర స్వామి అక్షింతలు, పసుపు కుంకుమ, పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసచారి, ఆలయ చైర్మన్ బుక్క రమేష్,అభయ హస్తం మిత్ర బృందం సభ్యులు కొమురవెల్లి రమేష్, దొంతుల సత్యనారాయణ, నంగునూరి విజయ్, నాయకులు సిరిపురం సత్యనారాయణ,



శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాసవీయూత్ క్లబ్ ఆధ్వర్యంలో పిడకల పంపిణీ

నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్ద, పాత వెంకటేశ్వర స్వామి గుడి వద్ద పిడకలను పంపిణీ చేశామని ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పుల్లూరి శివకుమార్ తెలిపారు. ఆదివారం పిడకల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను అందరు సుఖసంతోషాలతో జరుపుకోవాలని అన్నారు. పతంగులు ఎగురవేసేటప్పుడు చిన్నారులు జాగ్రత్తలు పాటించా లన్నారు. అనంతరం పండుగను పురస్కరించుకొని చిన్నారులకు వాసవి యూత్ ఆధ్వర్యంలో పతంగు యూత్ క్లబ్ అధ్యక్షుడు అరవపల్లి హరికిరణ్, సెక్రటరీ బుక్క శివ, ట్రెజరర్ తోట మణి పవన్, వాసవి మిత్రులు పాల్గొన్నారు.





అయోధ్య పూజిత అక్షింతల వితరణ

నవతెలంగాణ-గజ్వేల్

మున్సిపాలిటీ పరిధిలోని (ఎస్సీ) వీధిలో జాలిగామ బై పాస్ రోడ్‌లోఅయోధ్య పూజిత అక్షింతల వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామ జన్మభూమి భూమి మందిర నిర్మాణ తీర్థ క్షేత్ర ట్రస్ట్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు డా.ఆకుల నరేశ్ బాబు మాట్లాడుతూ అయోధ్య పూజిత శ్రీ రాముల వారి అక్షింతలు భారత దేశం లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రామ భక్తులందరికీ అందజేయడం జరుగుతుందనీ తెలిపారు. ఎవరికైనా అక్షింతలు అందనిచో తమ సమీపంలోని దేవాలయాల నుంచి పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంజి లక్ష్మన్, పోలోజి పవన్ కళ్యాణ్, దొంతుల దశరథరాములు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ఘనంగా ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-పాపన్నపేట



పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం ఓంశ్రీ డిజిటల్ అధినేత బైండ్ల వెంకటరమణ సౌజన్యంతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోచమ్మ ఆలయ ఆవరణలో జరిగిన ముగ్గుల పోటీ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని తమ తమ రంగవల్లులను అందంగా అలంకరించారు. ఇందులో ప్రతిభ కనబర్చి మార్కుల ఆధారంగా ఏకాభిప్రాయంతో విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జెడ్పిటిసి లింగన్నగారి మల్లప్ప, విశిష్ట అతిథిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ, కార్యక్రమ నిర్వాహకునిగా బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి, ఉపసర్పంచ్ బైండ్ల అంజలి, గ్రామ స్వయం సహాయక బృందాల నాయకురాలు అనిత, మంగమ్మ, గ్రామంలోని మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



సంక్రాంతి పర్వదినం సందర్భంగా మెదక్ ప్రజలకు ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని కుచన్ పల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజలు కుటుంబ సమేతంగా పండుగ చేసుకోవాలని సూచించారు. సంక్రాంతి అంటే పాడి పంటలతో రైతన్న సంతోషంగా ఉండే సమయమన్నారు. మూడు రోజులపాటు ఆనందంగా చేసుకునే పండుగ అని ఎమ్మెల్సీ తెలిపారు. ఆడపడుచులు రంగుల ముగ్గులతో, అబ్బాయిలంతా గాలిపటాలతో వేడుకలు చేసుకుంటారన్నారు. చిన్నారులు పతంగులు ఎగురవేసే క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్సీ సూచించారు. ఈ సంక్రాంతి పండగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన కాంతి వెలుగులు నింపాలని, ప్రజలంతా సుఖ శాంతులతో జీవించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

ఎన్‌స్‌యుఐ ఆధ్వర్యంలో పతంగుల పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

మకర సంక్రాంతి సంధర్భంగా ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు పతంగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం, ఎన్ ఎస్ యుఐ రాష్ట్ర కో ఆర్డినేటర్ దాసరి రాజు మాట్లాడుతూ పతంగుల ఎగురవేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఆనందంతో జాగ్రత్తలు పాటిస్తూ పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రజలందరికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్, ఎన్‌స్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షుడు బడికోల్ రాకేష్ యాదవ్, ఎన్‌స్‌యుఐ నాయకులు చెక్కిళ్ళ తరుణ్ గౌడ్, మొగిలి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టాలి

- పద్మశాలి సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్

నవతెలంగాణ-గజ్వేల్



యువకులందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు చేరువ కావాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు తలకొక్కుల దుర్గ ప్రసాద్ అన్నారు. ఆదివారం పద్మశాలి సంఘం యువజన క్యాలెండర్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు ముందుకు రావడం వల్లే గత ప్రభుత్వం పద్మశాలీల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందన్నారు. పట్టణంలో పద్మశాలిలకు మంచి భవనాలు నిర్మించారని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు కృషితో పద్మశాలి సంఘానికి భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు పూర్తి చేసుకుందన్నారు. ఎన్నికలకు ముందు భవనాన్ని ప్రారంభించుకున్నామని ఆయన గుర్తు చేశారు. పద్మశాలి యువజన సంఘం నాయకులు ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. రానున్న కాలం యువకులదేనని అన్ని రంగాల్లో ముందుండి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టాలని, నిత్యం ప్రజల్లో ఉండాలన్నారు. ఇలాంటి యువజన సంఘాలకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. స్వచ్ఛంద కార్యక్రమాలకు పార్టీలకు సంబంధం ఉండదని ప్రతి పౌరుడు సేవా కార్యక్రమం చేపడితే ప్రజలు ఎంతో సహకరిస్తారన్నారు. యువకులు ముందుకొస్తే పద్మశాలి సంఘం నాయకులంతా సహకారాలు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్, గౌరవాధ్యక్షులు స్వర్గం రాజేశం, సీనియర్ అడ్వకేట్ గుండు కాశీ ప్రసాద్, సూరం లింగం గుండు లక్ష్మణ్ గాడి పల్లి పెంటయ్య యువజన సంఘం కార్యవర్గ సభ్యులు గుండు మల్లేశం, గుండు చంద్రశేఖర్, దావత్ సతీష్ కుమార్, బొల్లి సదానందం, దేవసాని వాసు, సబ్బని చంద్రమౌళి, మెరుగు శ్రీనివాస్, ఎడెల్లి మహేందర్, షేర్ల నర్సింలు , దేవసాని హనుమాన్ దాస్ ఎడెల్లి విష్ణువర్ధన్, చెప్యాలా నరసింహారాజు, నల్ల శివకుమార్, ఇప్పలపల్లి రవి, దారా కృష్ణ, దార రమేష్ పాల్గొన్నారు.

గుర్రాలగొందిలో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-సిద్ధిపేటరురల్

నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది అభయాంజనేయ స్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో 7వసారి ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ఎంపిటిసి ఆకుల హరీశ్ పాల్గొని మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహిస్తారని దీనికి గ్రామ మహిళలు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేస్తారన్నారు. ముగ్గుల పోటీలలో మొదటి బహుమతి ముంజలత, రెండవ బహుమతి తేజస్విని, మూడో బహుమతి సురగొని శిరీష నాల్గోవ బహుమతి గొల్లపల్లి హర్షిణి, ముగ్గుల పోటీలలో పాల్గొన్న 50 మంది మహిళలకు, చిన్నారులకు ప్రోత్సాహ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితు



లు బాలకృష్ణ శర్మ, కవి ఉండ్రాళ్ల రాజేశం, దేవస్థాన కమిటీ సభ్యులు ఉండ్రాళ్ల తిరుపతి, ఆకుల శ్రీను, బొల్లి వాజ్పేయి, దుబ్బాక తిరుపతి, బట్టు శ్రీనివాస్, పటెండ్ల సతీష్, బట్టు అరవింద్, పటేండ్ల సాయి కుమార్, భామండ్ల రామ్, లక్ష్మణ్ ఉండ్రాళ్ళ శ్రీవర్ధన్, తోకల రాజుయాదవ్, బామండ్ల బాబు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల వితరణ

- శ్రీ రామ భజనలతో హోరెత్తిన కోహెడ వీధులు

నవతెలంగాణ-కోహెడ

శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ ఆలయంలో పూజిత అక్షింతల వితరణ కార్యక్రమం ఆదివారం విశ్వహిందూ పరిషత్, కోహెడ గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీరామ జయ రామ.. జయ జయ రామా అని భజన కీర్తనలు చేస్తూ విస్తృతంగా ప్రతి వాడవాడకు ప్రతి ఇంటికి అక్షింతలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయుల ఆకాంక్ష జనవరి 22న అయోధ్యలో భవ్యమైన దివ్యమైన శ్రీ రామ మందిరంలో భగవాన్ శ్రీ బాల రాముడు కొలువుదీననున్నారని 500 సంవత్సరాల భారతీయుల కళ నెరవేరబోతుందని, రామరాజ్యం



రాబోతుందన్నారు. ఈ శుభ సందర్భాన్ని దేశ ప్రజలందరు ఒక దీపావళి పండుగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఖమ్మం వెంకటేశం, కోహెడ ఉపసర్పంచ్ యాదవ్ అశోక్, మాజీ జెడ్పిటిసి పొన్నాల లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ తిప్పారపు నాగరాజు, మాజీ సర్పంచ్ బొమ్మడి జగన్ రెడ్డి, మంద రాజయ్య, ముంజ మల్లికార్జున్, ముంజ సంపత్, గుగ్గిల్ల శ్రీనివాస్, బండ వెంకటస్వామి, వేల్పుల శంకర్, మామిడి కరుణాకర్, ముంజ ప్రకాష్, వార్డ్ మెంబర్లు డైరెక్టర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు అక్కన్నపేట వాసి

నవతెలంగాణ-అక్కన్నపేట



ఢిల్లీ ఎర్రకోట వద్ద ఈనెల 26న జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనటానికి సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధి నారదాసు ఈశ్వర్ ముదిరాజ్ ఎంపికయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రంలో వివిధ రంగాల్లో కృషి చేస్తున్న పలువురిని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ రంగంలో మత్స్యకార, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటులో విశేషంగా కృషి చేస్తున్న ఈశ్వర్‌ను కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎంపిక చేసింది. ఈ మేరకు గణతంత్ర వేడుకలకు హాజరుకావాలని తనకు ఆహ్వానం అందిందని ఈశ్వర్ తెలిపారు. గణతంత్ర వేడుకలకు హాజరయ్యే అరుదైన అవకాశం లభించడం పట్ల గ్రామస్థులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

ఖానాపూర్‌లో అయోధ్య అక్షింతలు పంపిణీ

నవతెలంగాణ-నంగునూరు



మండలంలోని ఖానాపూర్ గ్రామంలో ఆదివారం అయోధ్య పూజిత అక్షింతలు పంపిణీ చేశారు. అయోధ్య నుంచి వచ్చిన శ్రీ రాముడి అక్షింతలు హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం అక్షింతల కలశంతో జై శ్రీ రామ్ అని నినాదాలతో ర్యాలీగా భక్తులు భజన పాటలతో ఇంటింటికి తిరుగుతూ అక్షింతలను భక్తులకు పంపిణీ చేశారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి అక్షింతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వంటేరు జయపాల్ రెడ్డి, వంటేరు రాజశేఖర్ రెడ్డి, అనుముల హన్మంత రెడ్డి,గొట్టం రంగారెడ్డి, కసాని చెన్న రెడ్డి, మొగుళ్ళ యాదవ రెడ్డి, తోట యాదగిరి, తెలు శ్రీశైలం, కాయిత కృష్ణమూర్తి, బల్ల మల్లేశం, కోడెల రమేష్, జెట్ట రాజు, మంచె సిద్ధయ్య, బండి క్రాంతి, గుండెల్లి మహేష్, గుండెల్లి శ్రీకాంత్,పెంబర్తి అనిల్, గుండెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-మర్కుక్

ండలంలోని ఇప్పలగూడెం గ్రామానికి చెందిన బర్లకాడి ఎల్లయ్య(63), బర్లకాడి పోచమ్మ మృతి(68) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మర్కుక్ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి భాదిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట ఉప సర్పంచ్ రాజు, కత్తెరపాక రాజు, తదితరులున్నారు.

కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కన్న యాదవ్‌కు సన్మానం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మెగా కబడ్డీ పోటీలు ఆదివారం ఫైనల్‌కు చేరుకున్నాయి. హోరా హోరీగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు కన్నా యాదవ్‌కు కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం సీ సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ చేతుల మీదుగా శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

అతివేగంతో లారీ బోల్తా: డ్రైవర్ మృతి

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



ప్రమాదవశాత్తు అతివేగంతో లారీ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన హవేలి ఘనపూర్ మండలం పరిధిలోని మెదక్ బోధన్ ప్రధాన రహదారి లెప్రసీ హాస్పిటల్ మూలమలుపు వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. అతివేగంతో లారీ బోల్తా పడిన ఘటనలో మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణానికి చెందిన మహమ్మద్ అజీజ్ (30) మృతి చెందాడు. మృతుని సోదరుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తూప్రాన్ నుంచి నాందేడ్ పట్టణానికి రేకుల లోడుతో వెళుతున్న లారీ హవేలి ఘనపూర్ మండలం ఔరంగాబాద్ లెప్రసీ హాస్పిటల్ మూలమలుపు వద్ద ప్రమాదానికి గురైంది. మృతుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు ఒక కుమారుడు ఉన్నారు.

అయోధ్య రాముని పల్లకీ మోసిన ముస్లిం సోదరుడు



నవతెలంగాణ-నిజాంపేట

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ సందర్భంగా శ్రీరామ పల్లకిని ముస్లిం సోదరుడు మోసి మతసామరస్యాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ గౌస్ పల్లకి మోస్తూ జై శ్రీరామ్ అంటూ నినాదాలతో గడపగడపకు తిరుగుతూ శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ శ్రీరాముని సేవలో కలిసి నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు, గ్రామస్థులు లక్ష్మణ్ గౌడ్, దుబ్బరాజ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా భోగి పండుగ సంబరాలు

నవతెలంగాణ-వెల్దుర్తి



ఉమ్మడి మాసాయిపేట వెల్దుర్తి మండలాల్లోని ప్రజలందరూ మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం తెల్లవారుజాము నుంచి భోగి మంటలు వెలిశాయి. మహిళలు ఉదయం నుంచి కల్లాపు చల్లి ముగ్గులు వేసి సంబరా లు చేసుకున్నారు. ప్రతి ఇంట్లో పిండి వంటలు గుమగుమలు ఆడపిల్లల కోలాహల ం పల్లెటూరి వాతావరణం నెలకొంది. గత వర్షాకాలంలో పండించిన ధాన్యరాశులు ఇంట్లో నిండుకుండను తలపిస్తున్నాయి. ఇంటిల్లిపాదులు సుఖ సంతోషాలతో ఉన్నారు. సోమవారం మకర సంక్రాంతి పండుగ ఘనంగా చేసుకునేందుకు సన్నహాలు చేసుకున్నారు.

చెక్‌పవర్ రద్దు తీర్పు ప్రతిపక్షాలకు చెంపపెట్టు

- సర్పంచ్ కుమ్మరి జగన్నాథం

నవతెలంగాణ -పాపన్నపేట

చెక్ పవర్ రద్దు చేస్తు హైకోర్టు న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రతి పక్షాలకు చెంపపెట్టులాంటిదని కొత్తపల్లి సర్పంచ్ కుమ్మరి జగన్నాథం ఆదివారం తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఈ నెల 6న (శనివారం) చెక్ పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం, తన ప్రతిష్టకు కలిగించే విధంగా వ్యవహరించడమే కాకుండా తనను రాజకీయంగా దెబ్బతీయాలనే దురుద్దేశంతో లేని పోని ఆరోపణలు చేస్తూ అధికారులను తప్పుదోవ పట్టించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి చెక్ పవర్ రద్దు చేయించడాన్ని సవాలు చేస్తూ తాను హైకోర్టు న్యాయస్థాన్ని ఆశ్రయించానని తెలిపారు. తన విన్నపాన్ని స్వీకరించిన గౌరవ న్యాయస్థానం వెంటనే చెక్ పవర్ రద్దును నిలుపుదల చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశిస్తూ కోర్టు ఉత్తర్వులలో ఆదేశించించిందన్నారు. తాను మండలంలో తమ గ్రామాన్ని (కొత్తపల్లి) అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, జిల్లాలో ఉత్తమ గ్రామపంచాయతీ, ఉత్తమ సర్పంచ్‌గా జిల్లాకలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నానని తెలిపారు. కాగా నిధులు దుర్వినియోగం చేశానని చెప్పి ఉపసర్పంచ్, ఆమె భర్త తమ ప్రతిష్టకు భంగం కలిగించేలా తనను అభాసు పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్ పదవి నుంచి తొలగించాలని గ్రామ వార్డు సభ్యులు తీర్మానం చేయడం మూలంగానే ఆమెను అప్పటి గౌరవ కలెక్టర్ తొలగించడంతో గ్రామ వార్డు సభ్యుల తీర్మానం మేరకే మరో సభ్యులైన సోమశేఖర్‌ను జాయింట్ చెక్ పవర్ బాధ్యతలను అప్పగించామని పేర్కొన్నారు. అప్పటి నుంచే గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌కు జాయింట్ చెక్ పవర్ ఉన్న సోమశేఖర్‌తో డిజిటల్ సంతకంతోనే పనుల బిల్లుల చెల్లింపులు జరిపిస్తున్నట్లు వెల్లడించారు. మళ్ళీ ఉపసర్పంచ్ అంజలి పేరున బాధ్యతలను పునరుద్ధరణ చేయాలని అధికారులు ఆదేశిస్తూ పంచాయతీ కార్యదర్శికి ఉత్తర్వులు అందితే తిరిగి డిజిటల్ సంతకం మార్పు చేయవల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శిపై ఉంటుందన్నారు. బాధ్యతలు తీసుకొనే బాధ్యత ఉప సర్పంచ్ అయిన అంజలికి ఉంటుంది కానీ సర్పంచ్ పై ఉండదని తెలియచేస్తూ పంచాయతీ కార్యదర్శి తప్పిదాలను తనపై రుద్దుతూ రాజకీయంగా పరువు తీయాలని దురుద్దేశంతోనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ అధికారులను తప్పు దోవ పట్టించి చెక్ పవర్ రద్దు చేయించారని దుయ్యబట్టారు. ఉపసర్పంచ్ సస్పెండ్



అయిన నాటి నుంచి ప్రతి నెల జరిగే గ్రామ పంచాయితీ మీటింగ్‌లకు కూడా రాకుండా తనపైన ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. ఏదైనా ఉంటే ప్రజల మన్ననలు పొందడానికి గ్రామాభివృద్ధి చేసి చూపించాలే తప్ప రాజకీయంగా ఎదుర్కొలేక, లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని జగన్నాథం హితవుపలికారు. ఎప్పుడు కూడా న్యాయం గెలుస్తుందనడానికి ఇది నిదర్శనమని సర్పంచ్ స్పష్టం చేశారు.

ఘనంగా గోధా రంగనాథ స్వామి కల్యాణం



నవతెలంగాణ-చేర్యాల

నెల రోజుల పాటు సాగిన ధనుర్మాస వ్రతం, గోదా రంగనాధ కళ్యాణం ఆదివారం చేర్యాల పట్టణ కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో అశేష భక్తుల భక్త ప్రపత్తులతో అంగ రంగ వైభవంగా జరిగింది. కళ్యాణాన్ని ప్రధాన అర్చకులు శేష చార్యులు, రాజు స్వామీ, విజయ్ కుమార్‌లు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దాతల సహకారంతో సుమారు1000 మందికి అన్నదానం నిర్వహించారు.

వెంకటాపూర్‌లో గుడిసె దగ్ధం

- పేదవాడిని ఆదుకోవాలని గ్రామస్తుల వేడుకలు

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని కే వెంకటాపూర్ గ్రామంలో ఒక నిరుపేద కుటుంబానికి చెందిన తులసమ్మ గోపరి నరసింహులు దుర్గమ్మల గుడిసె కరెంటు సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం ఉదయం 9:30 గంటల ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. గుడిసెలోని బట్టలు, బియ్యం, నిత్యావసర సరుకులు కలిపి దాదాపు రూ.50 వేల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు. రాత్రిపూట అయితే ప్రాణ నష్టం జరిగేదని ఉదయం పూట అయినందున ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దయాకర్ తెలిపారు. ఈ కుటుంబానికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని రెక్కాడితేకానీ డొక్కాడని



జీవితాలని, బాధితుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని , వారికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. బాధితుల కుటుంబాన్ని ఎవరైనా ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. బాధితుల కుటుంబాన్ని ఆదుకోవాలని ఎంపీటీసీ భాగ్య లక్ష్మి సిద్ధ రాములు, ఉప సర్పంచ్ శేఖర్ మహిపాల్, గోపరి స్వామి, వెంకట్, నర్సింలు, తదితరులు కోరారు.

ప్రజలకు ఎమ్మెల్యే సంక్రాంతి శుభాకాంక్షలు

నవతెలంగాణ-నిజాంపేట



సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిజాంపేట మండల ప్రజలకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కుటుంబ సమేతంగా పండుగ చేసుకోవాలని సూచించారు.